## క్లుప్తంగా

### తాగునీటి ట్యాంకుకు శంకుస్థాపన



గుడిమూలలో వాటర్ ట్యాంకుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాపాక

**సఖినేటిపల్లి:** మండలంలోని గుడిమూలలో సోమవారం తాగునీటి ట్యాంకు నిర్మాణం పనులకు రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ట్యాంకు నిర్మాణానికి స్థలం ఇచ్చిన దాతను ఆయన సత్కరించారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీ రుద్రరాజు చినరాజా, సర్పంచ్ దెందుకూరి శ్రీహరిరాజు, నాయకులు ఆర్.సహదేవరాజు, కోన ప్రభాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శిరీష, స్థానికులు పాల్గొన్నారు.

### ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

**అంబాజీపేట:** ఆరోగ్య వంతమైన పంటలు పండించేందుకు సహజ సిద్ధమైన ప్రకృతి వ్యవసాయాన్ని ప్రతి రైతు ప్రోత్సహించాలని సర్పంచ్ జల్లి బాలరాజు అన్నారు. పుల్లేటికుర్రులో ప్రధానమంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ యోజన (పీఎంఏజేఏవై) పథకం ద్వారా షెడ్యూల్డ్ కులాల సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న షెడ్యూల్డ్ కులాల రైతులకు వ్యవసాయ పనిముట్లు, విత్తనాల పంపిణీ కార్యక్రమం ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి నాగవరపు శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. సర్పంచ్ మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా విత్తనాలు, పనిముట్లను అందిస్తున్నారన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకుని ప్రకృతి సహజ సిద్ధమైన పంటలు పండించాలన్నారు. కార్యక్రమంలో యూనిట్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### ఓటర్ల సర్వే త్వరగా పూర్తి చేయాలి

**అంబాజీపేట:** ఓటర్ల జాబితా ఆధారంగా ఇంటింటికీ వెళ్లి చేపట్టిన సర్వేను ఈ నెల 21లోగా పూర్తి చేయాలని తహసీల్దార్ టి.మంగతాయారు ఆదేశించారు. బీఎల్వోలకు సోమవారం పలు సూచనలు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ సర్వే సకాలంలో పూర్తి చేసేలా బీఎల్వోలు ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. జాబితాలో తప్పులను సవరించడంతో పాటు నూతన ఓటర్లను చేర్చడం, మరణాలను గుర్తించి వాటి వివరాలను నమోదు చేయాలన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ఓటరు సర్వే పారదర్శకంగా చేయాలన్నారు.

### సీసీ రోడ్ల నిర్మాణం

**మామిడికుదురు:** పాశర్లపూడిలంకలో రూ.15 లక్షలతో సిమెంట్ కాంక్రీట్ రోడ్ల నిర్మాణానికి సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు సోమవారం శంకుస్థాపన చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మంజూరు చేసిన రూ.10 లక్షలు, జెడ్పీటీసీ కొరెడ్డి అంజిబాబు అందించిన రూ.5 లక్షలు వెరసి రూ.15 లక్షలతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ నిధులతో మారుమూల ప్రాంతాల్లో కూడా పక్కా రోడ్లు నిర్మించి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చెరుకూరి పార్వతీదేవి, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు బాలం రమేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### పేదలకు అన్నదానం

**రావులపాలెం:** పేదల ఆకలి తీర్చడమే నైటింగిల్ అకాడమీ అఫ్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ లక్ష్యమని ఆ సంస్థ సెక్రటరీ కొల్లి శివాజీ అన్నారు. సోమవారం స్థానిక ఇందిరా కాలనీ సంస్థ కార్యాలయం వద్ద పేదలకు ఉచితంగా అన్నదానం చేశారు. శివాజీ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వృద్ధులు, వితంతువులకు అన్నదానంతో పాటు వస్త్రాదానం, పేద విద్యార్థులకు బుక్స్ పంపిణీని తమ సంస్థ నిర్వహిస్తుందన్నారు.

### ఏపీఎన్జీఓ మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

**రాజోలు:** ఏపీ ఎన్జీఓ సంఘ 21వ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు సోమవారం ఆవిష్కరించారు. ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో మహాసభలు జరుగుతాయని రాజోలు తాలూకా యూనిట్ అధ్యక్షుడు డి.సుబ్రహ్మణ్యం ఎమ్మెల్యేకు వివరించారు. మహాసభలకు సీఎం జగన్ హాజరవుతారని ఉద్యోగులంతా తరలివచ్చి మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### విద్యార్థినికి అభినందన

**కొత్తపేట:** మండలంలోని గంటి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో 559 మార్కులతో పాఠశాల ప్రథమ స్థానం, మండల ప్రభుత్వ పాఠశాలల స్థాయిలో ద్వితీయ స్థానంతో ట్రిపుల్ ఐటీ సీటు సాధించిన దొంగ మోహిత సత్యదుర్గ అభినందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పాఠశాలలో హెచ్‌ఎం అక్కిరెడ్డి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో సర్పంచ్ బంగార్రాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సత్యదుర్గను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉద్బోధించారు. విద్యార్థిని దుర్గను సర్పంచ్ బంగార్రాజు చేతుల మీదుగా సత్కరించి కొంత నగదు అందచేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ముళ్ల జనార్దనరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గతం కన్నా మిన్నగా వరద సాయం

- తక్షణం స్పందించిన ప్రభుత్వం
- ఆనందం వ్యక్తం చేస్తున్న బాధితులు

**మామిడికుదురు:** గోదావరి వరద సాయం పంపిణీలో ప్రభుత్వం ఎంతో ఉదారంగా వ్యవహరించింది. నిత్యావసరాల పంపిణీ నుంచి ఆర్థిక సహాయం అందించడం వరకు అన్నింటిలోనూ పెద్ద మనసును చాటుకుంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వాధికారులు యుద్ధ ప్రాతిపదికన వరద బాధితులకు సహాయం అందించి బాధితుల ప్రశంసలందుకున్నారు. వరద సమయంలో బాధితులకు ఆహారం పంపిణీ నుంచి వరద పూర్తిగా తగ్గిన తరువాత అయిదు రకాల నిత్యావసరాలను అందించడం, వెను వెంటనే బాధితులకు ఆర్థిక సహాయం అందించడం వరకు



పెదపట్నంలంకలో వరద బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

ప్రతి అంశంలోనూ జెట్‌స్పీడుతో పని చేశారు.

**మూడు నియోజకవర్గాల్లో పంపిణీ ఇలా...**

పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లోని 10 మండలాల్లో 14,187 మందికి నిత్యావసరాలు అందించారు. ఒక్కొక్కరికి 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళా దుంపలు, లీటరు ఆయిల్ వంతున అందించారు. పి.గన్నవరం నియోజకవర్గంలో అత్యధికంగా 12,659 మందికి నిత్యావసరాలు అందించారు. రాజోలు నియోజకవర్గంలో 1191 మందికి, కొత్తపేట నియోజకవర్గంలో 337 మందికి నిత్యావసరాలు అందించారు. ధవళేశ్వరం వద్ద గోదావరి వరద రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరిన రోజు నుంచి వరద బాధితులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా బోట్లు ఏర్పాటు చేశారు. రాజకీయ లబ్ధి కోసం ప్రతి పక్షాలు కొన్ని చోట్ల వరదను రాజకీయం చేసి బురద చల్లాయి తప్ప బాధితులకు అండగా నిలవడంలో గత ప్రభుత్వాల కన్నా జగన్ సర్కారు ఎంతో మెరుగ్గా పని చేసిందని బాధితులు పేర్కొన్నారు.

### అండగా నిలిచింది



గోదావరి వరద వల్ల ఇబ్బందులు పడ్డా ప్రభుత్వం ఎంతో పెద్ద మనసుతో మమ్మల్ని ఆదుకుంది. బియ్యంతో పాటు మరో నాలుగు రకాలు నిత్యావసరాలను తక్షణం అందించిన తీరు వర్ణనాతీతం. ప్రతి ఒక్క బాధితుడికి ప్రభుత్వం సహాయం అందించింది. నిత్యావసరాలతో పాటు రూ.రెండు వేల ఆర్థిక సహాయం కూడా అందించి మాకు ఇబ్బంది లేకుండా చేసింది.

– గెద్దం అనితకుమారి, పెదపట్నంలంక

### అధికారులు మా వెన్నంటే నిలిచారు



గోదావరి వరదతో ప్రజలు ఇబ్బంది పడకుండా అధికారులు మాకు ఎంతో అండగా నిలిచారు. ఒక రోజు భోజనాలు అందించారు. వరద పూర్తిగా తగ్గకుండానే నిత్యావసరాలు ఇచ్చారు. వీటితో పాటు రూ.రెండు వేల ఆర్థిక సహాయం కూడా అందించారు. గోదావరి వరద సమయంలో అధికారులు అనుక్షణం మాకు అండగా ఉండి మా వెన్నంటి నిలిచారు.

– ఎస్.శ్రీనివాస్, అప్పనపల్లి

### చాలా బాగా ఆదుకున్నారు



ఎన్నో వరదలు వచ్చాయి. ప్రస్తుత ప్రభుత్వం అందించిన విధంగా ఎప్పుడూ సహాయం అందించ లేదు. నిత్యావసరాలు అందించారు. ఆర్థిక సహాయం చేశారు. ఇంత కంటే ఏం కావాలి. బాధితులకు ఏం కావాలో ప్రభుత్వమే ఆలోచించి చేసింది. బాధితులు కూడా ఈ విధమైన భరోసా కావాలనే కోరుకున్నారు. ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు ఏ ఇబ్బంది లేకుండా చూశారు.

– జి.వెంకటనర్సమ్మ, బి.దొడ్డవరం

### నేడు సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



కొండుకుదురులంకలోని తొత్తరమూడి వారిపేట వద్ద రోప్‌తో పోలీసుల బందోబస్తు

**అయినవిల్లి:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో భాగంగా అయినవిల్లి మండలంలోని కొండుకుదురులంక గ్రామంలో తొత్తరమూడివారిపేటలో వరద బాధితులను మంగళవారం పరామర్శించనున్నారు. నదీకోతకు గురవుతున్న ప్రాంత ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు, నదీ కోత నివారణకు శాశ్వత పరిష్కారం చూపిస్తారు. ఈ ఏర్పాట్లను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ శ్రీధర్ తదితరులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. వేదిక వద్ద డాగ్ స్క్వాడ్, మెటల్ డిటెక్టర్ల సాయంతో ప్రత్యేక బృందాలు తనిఖీలు నిర్వహించాయి. సీఎం సమావేశానికి తగ్గట్టుగా బారికేడ్లు నిర్మించారు. పోలీసులు రోప్‌తో బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ట్రయల్ రన్ నిర్వహించారు.

# గర్భిణులకు సామూహిక సీమంతాలు

**ఆత్రేయపురం:** సీఎం జగన్ ఆరోగ్యవంతమైన నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆత్రేయపురం సీతారామరాజు సెంటర్ వద్ద స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గర్భిణులు, పుట్టబోయే పిల్లల ఆరోగ్యం దృష్ట్యా మహిళలు పౌష్టికాహార లోపంతో ఇబ్బందులు పడకూడదనే దృఢ సంకల్పంతో సీఎం జగన్ ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులు, బాలింతలకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి చేతుల మీదుగా వైఎస్సార్ పోషణ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో 20 మంది గర్భిణులకు సీమంతాలు చేసి ఆశీర్వదించారు. మహిళలకు నూతన వస్త్రాలు కానుకగా అందించిన ఎంపీడీఓ నాతి బుజ్జిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ ముదునూరి రామరాజు, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, ఎంపీటీసీ సరెళ్ల ధనలక్ష్మి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పెన్మెత్స బంగార్రాజు, ఎంపీడీఓ నాతి బుజ్జి, సీడీపీఓ శారద, సూపర్‌వైజర్ కుమారి, సర్పంచ్‌లు పాలా నాగేశ్వరరావు, కరుటూరి బ్రహ్మజీ, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఆత్రేయపురంలో గర్భిణులకు సీమంతాలు చేసిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

**సఖినేటిపల్లిలో..**

**సఖినేటిపల్లి:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అధికారులు గర్భిణులు, బాలింతలకు ఏర్పాటు చేసిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం రేషన్ (టీహెచ్‌ఆర్) కార్యక్రమాన్ని ఎంపీపీ వీరా మల్లిబాబు ప్రారంభించారు. అలాగే ఐసీడీఎస్ ఆధ్వర్యాన గర్భిణులకు సీమంతం కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్వహించారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీటీసీ మందపాటి రత్నం, ఎంపీడీవో భీమారావు, ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి, ఎంఈవో డీ.కిషోర్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

**ఆలమూరులో..**

**ఆలమూరు:** మండలం జొన్నాడలోని మూలాటిరేవులో బీసీ కమ్యూనిటీ హాలులో సోమవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ జరిగింది. కొత్తపేట ఐసీడీఎస్ సీడీపీఓ పి.శారద ఆదేశాల మేరకు ఆలమూరు సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్.నాగలక్ష్మి, గ్రామ అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సర్పంచ్ కట్టా శ్రీనివాస్, ఉపసర్పంచ్ నాంద్ర నాగమోహన్ రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు తాడి మెహర్ ఆదిత్యరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గ్రామంలోని గర్భిణులు, బాలింతలకు కిట్లను అందజేశారు.

**వెదిరేశ్వరంలో..**

**రావులపాలెం:** మండలంలోని వెదిరేశ్వరం బాలయోగి పార్కు అంగన్వాడీ కేంద్రంలో సోమవారం టేక్ హోమ్ రేషన్(టీహెచ్‌ఆర్) కార్యక్రమాన్ని సీడీపీఓ డైరెక్టర్ టి.శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ బొక్కా కరుణాకరం హాజరై వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు.

**అప్పనరామునిలంకలో..**

**సఖినేటిపల్లి:** మండలంలోని అప్పనరామునిలంక సచివాలయం వద్ద సోమవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈ మేరకు గర్భిణులు, బాలింతలకు వీటిని అందజేశారు. కార్యదర్శి కొండా బులిసూరన్న, మహిళా పోలీసు కీర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మీరా మున్నీసా తదితరులు పాల్గొన్నారు.

# మాత్రల పంపిణీని విజయవంతం చేయాలి

**కొత్తపేట:** ఈ నెల 10 జాతీయ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రచార పోస్టర్లను ఎంపీపీ గంగాధరరావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పిల్లలు, కిశోర బాలల కడుపులో నులిపురుగులు ఉంటే వివిధ అనారోగ్య సమస్యలు ఏర్పడతాయన్నారు. ఈ సమస్యలకు కారణమైన నులిపురుగులను నిర్మూలించి, బాలలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు అందరూ విధిగా మాత్రలు వేసుకునేలా చూడాలని ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ దంగేటి సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ ఈ.మహేశ్వరరావు, ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్, వానపల్లి పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

**అంబాజీపేట:** జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని ఈ నెల 10న మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట పీహెచ్‌సీ వద్ద వైద్యాధికారి వి.గౌతమి అధ్యక్షతన ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ పర్యవేక్షణలో ఆల్బెండజోల్ మాత్రలను జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సోమవారం పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ మాత్రలు వేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించాలన్నారు. అనంతరం ఆల్బెండజోల్ మాత్రలను ఎంపీడీఓ కె.సత్యనారాయణ, తహసీల్దార్ టి.మంగతాయారు చేతుల మీదుగా ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కడలి సాయిరామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చేనేత దంపతులకు సన్మానం

**మామిడికుదురు:** జాతీయ చేనేత దినోత్సవాన్ని మొగలికుదురులోని జగ్గన్నపేటలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సొసైటీ కార్యాలయం వద్ద సొసైటీ అధ్యక్షుడు బళ్ల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో 10 మంది వృద్ధ చేనేత కార్మికులను ఘనంగా సత్కరించారు. వారికి పూలమాల వేసి, శాలువాతో సత్కరించారు. నాటి తరం కార్మికుల వల్లే నేటికీ చేనేత రంగానికి మంచి గుర్తింపు ఉందని సర్పంచ్ కడి అరుణకుమారి, అప్పనపల్లి దేవస్థానం మాజీ చైర్మన్ పిచ్చుక చిన్న పేర్కొన్నారు. కార్యక్రమంలో కారుపర్తి కోటేశ్వరరావు, జాన ధర్మారావు, జాన పాలాక్షుడు, గుమ్మడి వీరభద్రం, చింతా చిన్న, కారుపర్తి ప్రకాశం, పిచ్చుక వీరభద్రరావు పాల్గొన్నారు.

**మోరిలో..**

**సఖినేటిపల్లి:** సీఎం జగన్ సారథ్యంలోని ప్రభుత్వం చేనేత కార్మికుల అభ్యున్నతికి తగిన చర్యలు తీసుకుంటోందని మోరి వీవర్స్ సొసైటీ మాజీ అధ్యక్షుడు జాన శంకరరావు అన్నారు. సోమవారం మోరి వీవర్స్ సొసైటీలో జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ చిత్రపటానికి శంకరరావు క్షీరాభిషేకం చేశారు. అనంతరం సొసైటీలో



జగ్గన్నపేటలో చేనేత కార్మిక దంపతులను సన్మానించిన వీవర్స్ సంఘం

గత 50 ఏళ్లుగా నేత నేస్తున్న కాశిన లక్ష్మీప్రసాద్‌ను మాజీ అధ్యక్షులు శంకరరావు, చింతా వీరభద్రేశ్వరరావు, చేనేత నాయకుడు ఉప్పు సోమరాజు ఘనంగా సత్కరించారు. సొసైటీ మేనేజర్ అంకం రామలింగేశ్వర ప్రసాద్, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

**ఆలమూరు:** మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం చేనేత కార్మికులకు ఘన సత్కారం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పలు గ్రామ సచివాలయాల పరిధిలో ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో సోమవారం అధికారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి చేనేతల ఔన్నత్యాన్ని వివరించారు.

# రూ.3 కోట్లతో తాగునీటికి చర్యలు

**ఆత్రేయపురం:** ప్రజలకు అవసరమైన ప్రతి మౌలిక సదుపాయాన్ని కల్పించేందుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. తప్పుడు రాజకీయాలతో ప్రజలను నమ్మించాలని చూస్తే ఆ ప్రజలే 2024లో ప్రతిపక్షాలను మళ్లీ తరిమికొడతారని అన్నారు. ఆత్రేయపురంలో రూ.3 కోట్లతో తాగునీటి పథకాలు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. సోమవారం ఆత్రేయపురం పెదహరిజనవాడలో తాగునీరు, పారిశుధ్యంపై పలు ఫిర్యాదులు రావడంతో ఆ ప్రాంతాన్ని అధికారులు, గ్రామస్తులతో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందిస్తామని, అదే సమయంలో చెరువులు సాగుచేసే రైతులకు నష్టం కలగకుండా ప్రత్యేక కమిటీని వేసి విచారణ నిర్వహిస్తామన్నారు. ఎంత ఖర్చయినా సరే పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు వెనకాడబోమన్నారు. అంతే కానీ అపోహలతో గ్రామంలో విభేదాలను పెంచి పోషించవద్దని దాని వల్ల గ్రామంలో అశాంతి నెలకొనే ప్రమాదం ఉందని గ్రామస్తులకు సూచించారు. ప్రజలకు సుపరిపాలన అందించేందుకు నిత్యం తపన పడే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని వర్గాలకు న్యాయం చేస్తుందే తప్ప ఎవరినీ నష్టపరచదన్నారు. ప్రత్యేకంగా వాటర్ ట్యాంక్‌లు నిర్మించి నేరుగా గోదావరి నీటిని ప్రతి ఇంటికీ అందించేలా త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు చేపడతామని ప్రకటించారు. రొయ్యల చెరువు వల్ల చుట్టుపక్కల భూములు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ఇటీవల పెదహరిజనవాడలో పలువురు ఉప్పునీరు వస్తుందని ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన స్పందించి పెదహరిజనవాడలో పర్యటించి ప్రజల నుంచి సమస్యలు సేకరించారు. అలాగే సమస్యలు పరిష్కారించాలని అధికారులను ఆదేశించారు. కమీటీ ఏర్పాటు చేసి గ్రామస్తులకు సమస్యలు లేకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ ముదునూరి రామరాజు, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, ఎంపీడీఓ నాతి బుజ్జి, మండల మత్స్యశాఖ అధికారి డేవిడ్, ఆర్‌డబ్ల్యూఎస్, ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు.



ఆత్రేయపురం పెదహరిజన వాడలో తాగునీటి సమస్యపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

### ఎమ్మెల్యే పరామర్శ

**రాజోలు:** అనారోగ్యంతో మృతి చెందిన ములికిపల్లి వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ కోన వెంకటేశ్వరరావు కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. సోమవారం వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. నాయకులు ఎంఎల్‌ఓ గుబ్బల శ్రీను, గ్రామశాఖ అధ్యక్షుడు దొమ్మేటి సత్యప్రసాద్, మారుబోయిన వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రేపటి నుంచి 'నా భూమి-నా దేశం'

**మామిడికుదురు:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 9 నుంచి 14 వరకు 'నా భూమి-నా దేశం' కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలోనూ నిర్వహించాలని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు సూచించారు. మామిడికుదురు ఎంపీపీ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రజలు ఎక్కువ సంఖ్యలో భాగస్వాములు అయ్యే విధంగా చూడాలన్నారు. సమావేశంలో ఉపాధి హామీ ఏపీఎం మేడిది సీతారామ్, జేఈ పేరాబత్తుల వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

**కొత్తపేటలో..**

**కొత్తపేట:** ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండలంలో ఈ నెల 9 నుంచి 'నా మట్టి.. నా దేశం', కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీపీ మార్గన గంగాధరరావు, ఎంపీడీఓ ఈ మహేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంపై సోమవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బందితో వారు సమీక్షించారు. 10న పంచప్రాణ ప్రతిజ్ఞ, 11న వసుధకు వందనం పేరుతో 75 మొక్కలు నాటడం, 14న సమరయోధుల కుటుంబాలకు సత్కారం, 15న జాతీయ పతాకాల ఆవిష్కరణ, అనంతరం వందన సమర్పణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఏపీవో ఎస్.ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు

**పి.గన్నవరం:** అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తుందని జి.పెదపూడి సర్పంచ్ దంగేటి అన్నవరం అన్నారు. గ్రామంలో 16 మందికి కొత్తగా రేషన్ కార్డులు మంజూరు కాగా, వాటిని సోమవారం ఆయన లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా వాణిజ్య విభాగం నాయకుడు మంతెన రవిరాజు, ఎంపీటీసీ పల్లి మోషే, కత్తుల విక్టర్‌బాబు, కుసుమ సుబ్బారావు, జి.లక్ష్మీనారాయణ, కాసర భగవన్నారాయణ పాల్గొన్నారు.

### మహాధర్నాకు అనుమతి లేదు

**ఆలమూరు:** విద్యుత్ ఉద్యోగులు మంగళవారం తలపెట్టిన విద్యుత్ సౌధ మహాధర్నాకు అనుమతి లేదని ఆలమూరు ఎస్సై ఎస్.శివప్రసాద్ తెలిపారు. విజయవాడలో 144వ సెక్షన్, పోలీసుయాక్ట్ 30 అమలులో ఉన్నందున అక్కడ నిరసన కార్యక్రమాలకు నిర్వహించడానికి వీలు లేదన్నారు. కావున విద్యుత్ ఉద్యోగులు పోలీసుశాఖకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన ఉద్యోగులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

### గద్దర్‌కు మృతి తీరని లోటు

**పి.గన్నవరం:** అట్టడుగు వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాటం సాగించిన గద్దర్ మృతి చెందడం తీరని లోటని రాష్ట్ర మాలల జేఏసీ కోకన్వీనర్ కోట రామ్మోహన్‌రావు అన్నారు. స్థానిక మూడు రోడ్ల సెంటర్లో ఆయన ఆధ్వర్యంలో నాయకులు గద్దర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. స్థానిక అక్విడెక్టు పార్కులో మమత స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో సోమవారం పలువురు నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

**మామిడికుదురు:** ప్రజాకవి గద్దర్ మృతి యావత్ దేశానికే తీరని లోటని రిటైర్డ్ ఎంఈఓ నీతిపూడి చంద్రరావు శ్లాఘించారు. మామిడికుదురు బస్టాండ్ కూడలిలో సోమవారం మండల అంబేడ్కర్ యువజన సంఘం, మండల మాల మహానాడు ఆధ్వర్యంలో గద్దర్‌కు నివాళులర్పించారు.

**మలికిపురం/సఖినేటిపల్లి:** గద్దర్ మృతికి నియోజకవర్గ పరిరక్షణ చైతన్య సమితి, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సంతాపం తెలిపారు. అలాగే సఖినేటిపల్లి ఎంపీపీ కార్యాలయంలో గద్దర్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఎంపీపీ వీరా మల్లిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవో భీమారావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# అవినీతికి తావులేకుండా పాలన

**మామిడికుదురు:** సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో పారదర్శకంగా పాలన జరుగుతుందని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. సోమవారం ఈదరాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే వరప్రసాదరావు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటికి వెళ్లి వారికి సంక్షేమ పథకాల ద్వారా అందిన ఆర్థిక సాయాన్ని లెక్కలతో సహా వివరించారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థతో పాటు సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ప్రజలకు జగన్‌కు అండగా నిలవాలన్నారు. ప్రతిపక్షాలు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఎవరి సిఫారసు అక్కర లేకుండా అర్హత ఒక్కటే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. వలంటీర్లు నేరుగా ప్రజల వద్దకే వచ్చి సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తిస్తున్నారని చెప్పారు. గతంలో ఎప్పుడూ కూడా ఈ విధమైన పాలన చూడలేదన్నారు. జనరంజకమైన పాలన కొనసాగాలంటే



ఈదరాడలో మహిళకు పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

జనం జగన్‌కు అండగా నిలవాలని ఎమ్మెల్యే వరప్రసాదరావు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి, గ్రామశాఖ అధ్యక్షుడు యెరుబండి సత్యనారాయణమూర్తి, పీఏసీఎస్ చైర్మన్ బొలిశెట్టి భగవాన్, పార్టీ నేతలు కుసుమ శ్రీధర్, యెరుబండి సూరిబాబు, సూరిశెట్టి బాబి, చేట్ల సత్యనారాయణ, కుసుమ పెరుమాళ్లకుమార్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

### చురుగ్గా రోడ్డు ఆధునీకరణ పనులు

**ఆలమూరు:** ఓఎన్జీసీ కార్యకలాపాలు, భారీ వాహనాల రాకపోకలతో అనతి కాలంలోనే ఆలమూరు నుంచి కలవచర్ల పెనికేరు మీదుగా వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీనివల్ల ఆ రోడ్డు వెంబడి వెళ్లే ప్రయాణికులు, విద్యార్థుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై స్థానికులు ఆలమూరు ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు సహకారంతో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. సత్వరమే ఆయన స్పందించి రోడ్డు పునర్నిర్మాణానికి రూ.నాలుగు లక్షలు నిధులు మంజూరు చేశారు. దీంతో శరవేగంగా జరుగుతున్న రోడ్డు పనులను ఏఎంసీ చైర్మన్ యనమదల తదితరులు పరిశీలించారు. సర్పంచ్ వనుం చిన్నావతి, ఎంపీటీసీ యనమదల స్వాతి, కురుపూడి లోవ సత్యనారాయణ, జుత్తుక శ్రీనివాస్, కాండ్రేగుల శ్రీనివాస్, గుత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### రజత పతక విజేత అక్షత్‌కు సన్మానం

**మామిడికుదురు:** అరుణాచల్‌ప్రదేశ్‌లో గత నెల 9 నుంచి 14 వరకు జరిగిన 5వ జూనియర్ బాయ్స్ నేషనల్ బాక్సింగ్ చాంపియన్ –2023 పోటీల్లో రజత పతకం సాధించిన రాజమహేంద్రవరానికి చెందిన పిల్లా అక్షత్‌ను సోమవారం ఘనంగా సత్కరించారు. నగరంలో నవయువ క్రీడా యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో అప్పనపల్లి ఎంపీటీసీ బొంతు నీలిమ అక్షత్‌కు పూలమాల వేసి జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. నవయువ క్రీడా యువజన సేవా సంఘం ద్వారా శిక్షణ పొందిన అక్షత్ జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో రాణించడం హర్షణీయమని ఎంపీటీసీ నీలిమ పేర్కొన్నారు. కార్యక్రమంలో బొంతు నరసింహారావు, పిల్లా దీపక్, బొంతు చందు, గెద్దం సురేంద్ర, బాక్సింగ్ కోచ్ బొంతు మధుకుమార్ పాల్గొన్నారు.

### ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

**ఆత్రేయపురం:** ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని రావులపాలెం డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ తెలిపారు. ఆయన సోమవారం ఆత్రేయపురం బస్టాండ్‌ను పరిశీలించి ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం రావులపాలెం డిపో నుంచి అరుణాచలం 4 రోజుల యాత్ర కోసం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 29న బయలుదేరి తిరుపతి, కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, శ్రీకాళహస్తి, విజయవాడ క్షేత్రాలను దర్శనం చేయించి అక్టోబర్ 2న రావులపాలెం చేరుకుంటుందన్నారు.

### వార్డు సభ్యుల ఎన్నికకు నేటి నుంచి నామినేషన్లు

**ఆత్రేయపురం:** మండలంలోని నార్కెడ్‌మిల్లి 6, బొబ్బర్లంక 10, ర్యాలి ఒకటో వార్డులు వివిధ కారణాలతో ఖాళీ అయిన వార్డు సభ్యుల ఎన్నికకు ఈనెల 8 నుంచి 10 వరకు నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఎన్నికల అధికారులు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. మరిన్ని వివరాలకు మండల పరిషత్ కార్యాలయం వద్ద సంప్రదించాలని కోరారు.

### ఆకస్మిక తనిఖీ

**ఆత్రేయపురం:** గ్రామంలో సోమవారం అంగన్‌వాడీ కేంద్రాన్ని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం పనితీరు, కేంద్రాల్లో నమోదైన పనితీరు, గర్భిణులు, చిన్నారులు, బాలింతల హాజరు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం, బాలామృతం, న్యూట్రిషన్ కిట్స్ తదితర వాటి పంపిణీ తీరును పరిశీలించారు.